సాక్షి ప్రకాశం

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



హవ్వ..ఇది బువ్వ !

జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో భోజనం అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. - 8లో..



చంపేశారా..?

ఒంగోలు మండలం పాతపాడుకు చెందిన అర్జున్ రెడ్డి మృతి విషయంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడితో కలిసి భార్యే భర్తను హత్య చేయించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ పాఠశాలల సమాచారం ఇవ్వండి

ఒంగోలు సిటీ: జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న 94 ఎయిడెడ్ పాఠశాలల పూర్తి సమాచారం డాక్యుమెంట్లతో సహా 12 పేజీలు మూడు సెట్లు డీఈఓ కార్యాలయానికి ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకటరావు, ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాల గుర్తింపు, పాఠశాల కమిటీ వివరాలు, పాఠశాల మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్ పాఠశాల వసతుల అన్ని వివరాలతో యాజమాన్యాలు బుక్‌లెట్ తయారుచేసి పంపాలని విద్యాశాఖ డైరెక్టర్ తెలిపినట్లు చెప్పారు.

నేటి నుంచి ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

ఒంగోలు సిటీ: ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ఒంగోలులోని డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం నుంచి ప్రారంభమవుతుందని డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ సబ్జెక్టుకు సంబంధించిన మూల్యాంకనం 4వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. సోషల్ సబ్జెక్టునకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి శుక్రవారం ఉదయం 8 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు హాజరుకావాల్సిందిగా కోరారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు చీమకుర్తి క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ వెంకట్

చీమకుర్తి: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు చీమకుర్తి క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ కరిచేటి వెంకట్ బుధవారం తెలిపారు. చీమకుర్తి గెలాక్సీ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఆరికాటి సూర్యతేజ, గూండా వెంకట సుకుమార్ ఎంపికయ్యారన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 9 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ హాకీ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కోచ్‌తో పాటు వారి తల్లిదండ్రులు అభినందించారు.

9లోపు సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు సిటీ: జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సబ్జెక్టు వారీగా సీనియారిటీ జాబితాకు సంబంధించిన అభ్యంతరాలను ఈ నెల 9వ తేదీ లోపల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఎ.కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా రూపొందించామన్నారు. ఈ జాబితాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ www.prakasamschooledu.com లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాల సమర్పణకు అవసరమైన వివరాలను అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు లేదా సాక్ష్యాలు ఉంటే జత చేయాలని, సంబంధిత అధికారి ధ్రువీకరణతో సమర్పించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయులకు తెలియజేస్తారన్నారు.

పచ్చందాలకు పొగ

ప్రకృతి ప్రేమికులకు భూతల స్వర్గంలా భావించే నల్లమల జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు. ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశాలు.. వివిధ రకాల వన్యప్రాణులకు కేరాఫ్ అడ్రస్. ఎన్నో ప్రత్యేకతలు సొంతం చేసుకున్న నల్లమల వేసవి కాలం వచ్చిందంటే కారుచిచ్చు రగులుతోంది. వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులు మంటలకు ఆహుతవుతున్నాయి. అటవీశాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. నిషేధాజ్ఞలు అమలు చేసినా చిన్నచిన్న మానవ తప్పిదాలు అడవులను దహించివేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రయాణికులకు, ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నా తరుచూ ప్రమాదాలు జరుగుతూ ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



అడవిలో మంటలు ఆర్పుతున్న అటవీ సిబ్బంది

- నల్లమలను వీడని అగ్ని ప్రమాదాలు
- ఈ ఏడాది 3 నెలల్లో 130 ప్రమాదాలు
- 50 ఫైర్ బోయర్స్ అందజేత
- 116 మంది ఫైర్‌వాచర్స్ నియామకం
- సిగరెట్లు తాగితే జరిమానా
- వ్యాన్ అగ్నియో జియో పోర్టల్ ద్వారా ప్రమాదాల గుర్తింపు

మార్కాపురం: ఎండాకాలం వచ్చిందంటే నల్లమల పరిసర ప్రాంతాల ప్రజలకు అగ్ని ప్రమాదాల భయం వెంటాడుతోంది. తెలిసో తెలియకో చేస్తున్న మానవ తప్పిదాలు అడవులను కాల్చివేస్తున్నాయి. వన్యప్రాణులకు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. దోర్నాల నుంచి శ్రీశైలం, దోర్నాల–ఆత్మకూరు, గిద్దలూరు–నంద్యాల మధ్య ఘాట్‌రోడ్డులో ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. కొంత మంది బీడీ, సిగరెట్ తాగి ఆర్పకుండా రోడ్డుపై వేస్తున్నారు. వేసవి తీవ్రత వలన అలా కిందపడిన నిప్పు గడ్డికి అంటుకుని వేగంగా వ్యాపించి అడవులను కాల్చివేస్తున్నాయి.



నల్లమలలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో మార్కాపురం, దోర్నాల, వైపాలెం, గంజివారిపల్లి, నెక్కంటి, కొర్రపోలు, గుంటూరు జిల్లా విజయపురి సౌత్ రేంజ్ ఉన్నాయి. అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడేందుకు అటవీ శాఖాధికారులు నడుం బిగించారు. ఈ ప్రాంతం మీదుగా వెళ్లే ప్రయాణికులు, ఈ ప్రాంతంలో పర్యటించే పర్యాటకులు బీడీలు, సిగరెట్లు తాగకుండా ఉండేలా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. ఒకవేళ తాగినట్లు గుర్తిస్తే జరిమానాలు సైతం విధిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఎలాంటి వంటలు చేయకుండా నిఘా ఉంచారు. 32 బేస్ క్యాంపుల్లో దాదాపు 346 మంది సిబ్బందిని నియమించి అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్న చెట్టుకు నిప్పు అంటుకున్నా అటవీ అధికారులు ప్రమాదాన్ని గుర్తించి కౌంట్ చేస్తారు. ఒక్కసారి అడవిలో కార్చిచ్చు వ్యాపించిందంటే ఆర్పేయటం అటవీ, అగ్నిమాపక సిబ్బందికి తలకు మించిన భారమవుతోంది.

116 మంది వాచర్‌ల నియామకం:

నల్లమల అడవుల్లో అగ్నిప్రమాదాలను నివారించేందుకు అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో ఉన్న మార్కాపురం, గంజివారిపల్లె, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, గుంటూరు విజయపురిసౌత్, నెక్కంటి వరకు విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగితే తక్షణం అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేందుకు 116 మంది ఫైర్‌వాచర్స్‌ను నియమించింది. వీరికి ఫైర్ ఫైటింగ్, ఎక్విప్‌మెంట్లను అందజేసింది. 50 ఫైర్ బ్లోయర్స్‌ను, 50 ఫైర్ కట్టర్స్‌ను సైతం అందించింది. 40కి పైగా వ్యూ లైన్స్‌ను ఏర్పాటు చేసి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు అటవీ ప్రాంతంలో నీటికుంటలు ఏర్పాటు చేసి అప్పటికప్పుడు నీటిని తీసుకుని వెళ్లేందుకు వాహనాలను సమకూర్చారు. ఈ సిబ్బంది దోర్నాల నుంచి శ్రీశైలం వరకు, యర్రగొండపాలెం నుంచి మాచర్ల వరకు, దోర్నాల నుంచి ఆత్మకూరు వరకు తమకు కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం తిరుగుతూ ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ అగ్నిప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు. దీంతో పాటు శ్రీశైలం వెళ్లే ప్రయాణికుల వాహనాలను గణపతి చెక్‌పోస్టు వద్ద ఆపి బీడీ, సిగరెట్లు తీసివేస్తూ, అగ్నిని మండించే పదార్థాలను కూడా స్వాధీనం చేసుకుంటున్నారు.



అడవిలో మంటలు

శాటిలైట్ ద్వారా అప్రమత్తం

దేశ వ్యాప్తంగా అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలను శాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు క్షణాల వ్యవధిలో తెలుసుకుంటూ సిబ్బందిని అక్కడికి పంపుతున్నారు. ప్రతి డీఎఫ్ఓ పరిధిలో 24/7 విధుల్లో ఉండేలా సిబ్బందిని నియమించారు. ఇందుకోసం వ్యాన్ అగ్నియో జియో పోర్టల్‌ను ఉపయోగిస్తున్నారు. శాటిలైట్ లింక్ ద్వారా ఇది పనిచేస్తోంది.

ప్రత్యేక శిక్షణ ఇచ్చాం



అడవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా సిబ్బందిని నియమించి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వారికి ఫైర్ బ్లోయర్స్ అందించాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే మా సిబ్బంది వెంటనే స్పందించి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే చెంచులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ప్రమాదం జరిగిన వెంటనే తమకు సమాచారం అందిస్తాం. దీని ద్వారా మేము సిబ్బందిని అప్రమత్తం చేసి సంఘటన స్థలానికి పంపి మంటలను ఆర్పి వేస్తాం. ప్రయాణికులు కూడా అటవీ ప్రాంతంలో ప్రయాణించేటప్పుడు బీడీలు, సిగరెట్లు తాగవద్దని మా విజ్ఞప్తి. చిన్న ప్రమాదం జరిగినా ఆ నష్టాన్ని పూడ్చటం సాధ్యం కాదు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. బీడీ, సిగరెట్లు తాగితే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తాం.

– సందీప్ కృపాకర్, డీడీ, మార్కాపురం

12వ పీఆర్సీకి కమిషన్‌ను నియమించాలి

- ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన
- తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ జరుగుతుందని, 11వ వేతన సవరణ ముగిసి 21 నెలల అయినా 12వ వేతన సవరణ కమిషన్ వేయకపోవడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొందని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల అన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించి, 12వ వేతన సవరణ కమిషన్ ను తక్షణమే నియమించాలని కోరుతూ ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కే.ఎర్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని, 2003 డీఎస్సీ వారికి కేంద్ర ప్రభుత్వ మెమో 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ, సరెండర్ లీవ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. 70 ఏళ్ల వయస్సు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ యాజమాన్యంలో కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, ప్రభుత్వ పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ కు సంబంధించిన 72 ,73 ,74 జీవోలను అమలు చేయాలని కోరారు. 117 జీవోను రద్దుచేసి ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా అమలు చేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియర్ జాబితాలో ఉన్న తప్పుల తడకలు సవరించి మెరిట్ కం రోస్టర్ ప్రకారం రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. బదిలీలకు సంబంధించి బాలికలు ఉన్న పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలని, 50 సంవత్సరాలు అనే నిబంధన తొలగించి ఉన్న వారిని కూడా బదిలీ చేయాలని, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులను సత్వరమే పరిష్కరించాలని కోరారు. జెడ్పీ పీఎఫ్ లోన్స్, క్లోజర్స్ విషయంలో సీఎఫ్ఎంఎస్ పంపించడంలో ఉన్న జాప్యాన్ని తొలగించాలన్నారు. ఎస్ఎస్‌సీ స్పాట్ నుంచి 60 ఏళ్ల వయసు దాటిన వారికి ఆర్డర్స్ పంపారని, అలాంటి వారిని సంబంధిత హెడ్మాస్టర్ రిలీవ్ చేయరాదని తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్.ఎం.డి.రఫీ, ఫ్యాప్టో ప్రకాశం జిల్లా నాయకులు వి.మాధవరావు, డి.జయరావు, వై.వెంకట్రావు, ఎస్.కె.అబ్దుల్ హై, వి.జనార్దన్ రెడ్డి, బి. వెంకట్రావు, రాష్ట్ర సంఘ బాధ్యులు కే.శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసులు, పి.వెంకట్రావు, జీవీకే కీర్తి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల

చంద్రబాబును ముస్లింలు

జీవితాంతం నమ్మరు



దక్షిణ బైపాస్‌లో నిరసన తెలుపుతున్న ఎస్డీపీఐ నాయకులు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అప్రజాస్వామిక వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును ముస్లింలు జీవితకాలంలో ఎప్పుడూ నమ్మరని, భారత దేశ ముస్లింల దృష్టిలో చంద్రబాబు దోషిగా నిలబడక తప్పదని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకుడు షేక్ అబ్దుల్ సత్తార్ స్పష్టం చేశారు. స్థానిక దక్షిణ బైపాస్‌లో చౌరస్తాలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టిన ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన చేస్తున్న తనతో పాటు తమ పార్టీ ప్రకాశం, నెల్లూరు జిల్లాల నాయకులను పోలీసులు అరెస్టు పేరుతో వాహనంలోకి ఎక్కించి జిల్లా సరిహద్దుల వరకు తీసుకొచ్చి విడిచిపెట్టారని తెలిపారు. పోలీసు చర్య అప్రజాస్వామికమని విమర్శించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం ప్రజా సంఘాలు నిరసన తెలియజేసినా, వాట్సప్‌ల ద్వారా 5 కోట్ల మంది ముస్లింలు వ్యతిరేకించినా నిరంకుశంగా వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ నల్లబిల్లును దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకించడమే కాకుండా ముస్లింలకు అండగా నిలబడతామని ప్రకటించగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం సవరణల పేరుతో ముస్లింల కళ్లు గప్పి బిల్లుకు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. వక్ఫ్ బిల్లు విషయంలో చివరి నిముషం వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వైఖరి ప్రకటించకుండా దాగుడు మూతలు ఆడిందన్నారు. వక్ఫ్ బిల్లుకు సవరణలు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ముస్లింలకు నమ్మకాలు సన్నగిల్లాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ గని, జిల్లా ప్రధాన కార్యదర్శి మలానా అసద్, జిల్లా నాయకులు పఠాన్ ఖాజా వలి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా నాయకుడు ఫాజిల్ పాల్గొన్నారు.

పది నెలల్లో జిల్లాకు ఏం చేశారో చెప్పండి

- ఏం చేశారో చెప్పుకోలేకనే రెడ్ బుక్ పేరుతో బెదిరింపులు
- వెలిగొండ ప్రాజెక్టులో తట్ట మట్టినైనా తీశారా?
- ఇద్దరు మంత్రులుండీ ఉమ్మడి జిల్లాకు చేసింది శూన్యం
- జిల్లాపై మంత్రి లోకేష్‌కి కనీస అవగాహన లేదు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లా కనిగిరిలో సీబీజీ ప్లాంట్ శంకుస్థాపన సభకు హాజరైన మంత్రి లోకేష్, ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. గడిచిన 10 నెలలుగా ప్రకాశం జిల్లాకి ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న ప్రభుత్వం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించిన వారిపై రెడ్ బుక్ పేరుతో బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించిన తర్వాతే జిల్లాలో అడుగు పెడతామన్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామన్నారు. దాన్ని ఇంతవరకు పట్టించుకోలేదు. వెలిగొండ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రాజెక్టు కోసం తట్టెడు మట్టి ఎత్తలేదు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కూడా కేటాయించలేదు. ఇటీవలే జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబు ప్రాజెక్టును కూడా సందర్శించడానికి ధైర్యం చేయలేక వెళ్లిపోయారు. ఇద్దరు మంత్రులుండీ వెలిగొండ ప్రాజెక్టు లైనింగ్ పనులు చేపట్టలేదు. జిల్లాకు ఏమీ చేయలేకపోయారు. లోకేష్ మాటలు వింటుంటే ఆయనకు జిల్లాపై కనీస అవగాహన లేదని స్పష్టంగా అర్థమవుతోంది. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మంచి చేస్తామని చెప్పే మంత్రులను చూశాం కానీ, మాట్లాడితే కేసులు పెడతామని హెచ్చరించే మంత్రిగా లోకేష్‌నే చూస్తున్నాం. లోకేష్ రెడ్‌బుక్ కి ఎవరూ భయపడేది లేదు. ఇటీవల స్థానిక సంస్థలకు నిర్వహించిన ఉప ఎన్నికలతో ఆ విషయం లోకేష్‌కి అర్థమయ్యే ఉంటుంది.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రకాశం జిల్లా అభివృద్ధి పరుగులు:

"ప్రకాశం జిల్లాకు వైఎస్సార్ సీపీ ఏం చేసిందని లోకేష్ ప్రశ్నిస్తున్నాడు.. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించింది. పాల శీతలీకరణ కోసం 161 సెంటర్లు ఏర్పాటు చేశాం. 591 సచివాలయాలు, 593 ఆర్బీకే సెంటర్లు, దాదాపు 1992 బడులను నాడు–నేడు కింద ఆధునీకీకరించాం. 228 డిజిటల్ లైబ్రరీలు, 492 హెల్త్ సెంటర్లు, రెండు అగ్రి ల్యాబ్‌లు వైఎస్సార్ సీపీ హయాంలోనే ఏర్పాటు చేశాం. వీటన్నింటికీ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.2 వేల కోట్లకుపైగా కేటాయించగా, ఒక్క వెలిగొండ ప్రాజెక్టు కోసమే ఏకంగా రూ.10 వేల కోట్లు కేటాయించారు. రామాయపట్నం పోర్టును వైఎస్సార్ సీపీ హయాంలోనే మొదలుపెట్టి దాదాపు 50 శాతం పనులు పూర్తి చేశారు. జిల్లాకు మెడికల్ కాలేజీ వచ్చిందంటే అదీ వైఎస్సార్ సీపీ హయాంలోనే. మర్డర్లు, మానభంగాలు చేసిన వారంతా టీడీపీలో ఉంచుకుని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వైఎస్సార్ సీపీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయింది. రోజుకు 70 మంది మహిళల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయని వారే ఒప్పుకున్నారు. ఆధారాలు లేకుండా అవాకులు చవాకలు పేలడం మానుకోవాలి. వెనుకబడిన ప్రకాశం జిల్లా మీద ప్రభుత్వం కరుణ చూపించాలి. ప్రజాప్రతినిధులుగా బాధ్యతగా మెలగాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల విషయంలో చిత్తశుద్ధితో పనిచేయాలి. కేవలం పది నెలల పాలనతోనే కూటమి ప్రభుత్వం దారుణమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుంది. వ్యవసాయం భారమైంది. గ్రామాల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. టీడీపీ నాయకులను తొందర్లోనే వెంటబడి తరిమి కొట్టే రోజులు రాబోతున్నాయి. గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జిల్లాకు ఏం చేశాడో చర్చకు సిద్ధమా?'' అని తాటిపర్తి ప్రశ్నించారు.

లోకేష్..ఇచ్చిన మాట నిలుపుకో

ఒంగోలు టౌన్: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కోర్టు కేసులను పరిష్కరించి కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని యువగళంలో మాట ఇచ్చిన లోకేష్ అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా మాట నిలుపుకోలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.బాబు విమర్శించారు. ఎల్బీజీ భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వమని సొంత డబ్బా కొట్టుకుంటే లాభం లేదని, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకుంటూ ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని చెప్పారు. తమ సొంత ప్రయోజనాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి సుప్రీం కోర్టు లాయర్లను పెట్టుకునే నాయకులు నిరుద్యోగుల కోసం మాత్రం ఒక లాయర్‌ను పెట్టడానికి తగిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే కోర్టులో ఉన్న కేసును త్వరితగతిన పరిష్కరించి కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ పరీక్షల తేదీని ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. వీలైనంత త్వరగా కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీని చేపట్టకుంటే చలో విజయవాడ పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పి.కిరణ్, పి.రాంబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు



హవ్వా.. ఇదా.. బువ్వ!

చీకూచింతా లేకుండా హాయిగా చదువుకోవాల్సిన విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. హాస్టళ్లు, పాఠశాలల్లో రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు పాలకులు చెబుతున్నదంతా ఒట్టిదేనని ఇటీవల కాలంలో మంత్రులు, ఉన్నతాధికారుల పరిశీలనలోనే తేటతెల్లమైంది. తాజాగా గిద్దలూరు మండలంలోని ఓ పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు భోజనం పెట్టని విషయం బయటపడింది. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలోనూ చిన్నారులపై కూటమి ప్రభుత్వం కక్ష చూపుతూనే ఉండటాన్ని విద్యావేత్తలు తప్పుబడుతున్నారు.

- కూటమి పాలనలో విద్యార్థులకు కూడు కరువు
- పాఠశాలలు, హాస్టళ్లలో ముద్దన్నం.. మురిగిన గుడ్లు
- ఫోర్టిఫైడ్ బియ్యంతోపాటు మెనూకు మంగళం
- పస్తులుంటున్నాం పట్టించుకోండని విద్యార్థుల ఆకలి కేకలు
- మంత్రులు, అధికారులకు మొరపెట్టుకున్నా మారని తీరు

జిల్లాలోని వసతి గృహాలు	175
విద్యార్థుల సంఖ్య	16,162 మంది
ప్రభుత్వ పాఠశాలలు	2341
విద్యార్థుల సంఖ్య	178615

నోట్ : పబ్లిక్ పరీక్షలు ముగిసిన దృష్ట్యా విద్యార్థుల సంఖ్యలో స్వల్ప మార్పులు ఉండొచ్చు..

కనిగిరి రూరల్/గిద్దలూరు రూరల్/పెద్దదోర్నాల/మార్కాపురం/ఒంగోలు ఒన్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు.. ఆకలిదప్పులతో పేద పిల్లలు విద్యకు దూరం కాకుండా ఉండేందుకు ఎంతో ఉన్నత లక్ష్యంతో చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చింది. అధికారం చేపట్టిన దరిమిలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బ తీసే నిర్ణయాలపైనే మొగ్గుచూపుతూ.. పేదల విద్యార్థుల గోరు ముద్దనూ కాలదన్నింది. పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతోపాటు స్వీపర్లను, వాచ్‌మెన్లు, ఆయాలను ఇష్టారీతిగా తప్పించి కూటమి కార్యకర్తలను నియమించడంపై చూపిన శ్రద్ధ.. విద్యార్థుల సంక్షేమంపై ఏనాడూ చూపలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలతో సహా ప్రభుత్వ పాఠశాలల్లో మెనూకు మంగళం పాడిన విషయం తరచూ తనిఖీల్లో బయటపడుతున్నా ఎక్కడా తీరు మారడం లేదు. మెస్ చార్జీ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అప్పు చేసి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి హాస్టళ్లలో నెలకొంది. 3, 4 తరగతుల విద్యార్థులకు రూ.1,150, 5 నుంచి 10వ తరగతి వారికి రూ.1,400, ఇంటర్, పీజీ విద్యార్థులకు రూ.1,600 చొప్పున మెస్ చార్జీలు చెల్లించకపోవడంతో మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం కూటమి ప్రభుత్వం నిలిపేసింది. అత్యుత్సాహంతో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే కళాశాలలను ప్రారంభించిన ప్రభుత్వం విద్యార్థులకు సక్రమంగా అన్నం పెట్టాలన్న సంగతిని మాత్రం విస్మరించింది.

విద్యార్థులు అర్ధాకలితో అల్లాడుతున్నారు



వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మోడల్ స్కూల్, జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలకల పాఠశాలలో భోజనం బాగోలేదని మంత్రి ఎదుటే విద్యార్థులు మొరపెట్టుకున్నారు. అయినా విద్యాశాఖ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరం. పేద పిల్లలు చదువుకునే పాఠశాలలపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.

– సీహెచ్ పవన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మెనూ సక్రమంగా అమలు చేయాలి



పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో భోజన పథకం అమలుపై నిర్లక్ష్యంగా ఉండటం భావ్యం కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం మానేశారు. దొడ్డు బియ్యంతో వండిన అన్నం తినలేకపోతున్నామని సాక్షాత్తు రాష్ట్ర మంత్రికే విద్యార్థులు విన్నవించడం హాస్టళ్లు, పాఠశాలల్లో పరిస్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సంగటి మహేంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

ముక్కిన బియ్యం.. మురిగిన గుడ్లు

సీన్ 5
ఎక్కడ: మార్కాపురం
ఎప్పుడు: మార్చి 17


మురిగిన కోడిగుడ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్ (ఫైల్)

మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నిర్వహణలో డొల్లతనం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పరిశీలనలో బట్టబయలైన సంఘటన ఇది. హాస్టల్లో విద్యార్థులకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని, నాణ్యత లేదని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో మార్చి 17వ తేదీ రాత్రి బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నాసిరకంగా ఉన్న కూరగాయలు, బియ్యం, మురిగిన కోడిగుడ్లను పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకూ ఇలాగే అన్నం పెడతారా అంటూ తీవ్ర స్వరంతో మందలించారు.

విద్యార్థుల కూడు గోడుకు ఇవిగో సాక్ష్యాలు

మెనూకు మంగళం

సీన్ 1
ఎక్కడ: ఒంగోలు
ఎప్పుడు: ఫిబ్రవరి 7

'మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు సార్. అడిగితే ఏమంటారోనని భయం. రోజూ ఆకలి బాధతో అల్లాడిపోతున్నాం' ఇదీ ఒంగోలులోని దివ్యాంగుల హాస్టల్ విద్యార్థుల ఆవేదన. ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన ఒంగోలు పర్యటనకు వచ్చిన విభిన్న ప్రతిభావంతుల ఆ శాఖ డైరెక్టర్‌కు మెనూ అమలు కావడం లేదని ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. దివ్యాంగులకు సరైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు పోషకాహారం అందించాల్సిన ప్రభుత్వం అది తమ పనికాదన్నట్టుగా వ్యవహరిస్తోందనడానికి ఈ సంఘటనే నిదర్శనం.


వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు వింటున్న డైరెక్టర్

రోజూ నీళ్ల చారే 'ఏపీ మోడల్'

సీన్ 2
ఎక్కడ: పెద్దదోర్నాల
ఎప్పుడు: ఫిబ్రవరి 20


అన్నం, నీళ్లచారు తింటున్న బాలికలు(ఫైల్)

పెద్దదోర్నాల మండల పరిధిలోని మొట్ల మల్లి కార్జునాపురంలోని ఏపీ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వసతి గృహ విద్యార్థినులు 100 మంది భోజనంతో పాటు వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరు 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందిన సమాచారంతో పాఠశాలను తనిఖీ చేయగా.. బాలికలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రిన్సిపాల్ ఏది చెబితే అదే వండుతున్నానని పార్ట్ టైమ్ వార్డెన్ చెప్పగా.. మెనూలో వంటకాలపై ప్రిన్సిపాల్ నీళ్లు నమిలారు. ఈ విషయంపై 'సాక్షి'లో కథనం రావడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఎవరూ ప్రశ్నించకుంటే వారికి రోజూ నీళ్ల చారే గతి!

ఆకలి బాధలు దిగమింగుకుని..

సీన్ 3
ఎక్కడ: కనిగిరి
ఎప్పుడు: ఫిబ్రవరి 24

కనిగిరి మోడల్ స్కూల్ విద్యార్థులు తమ ఆకలి కేకలను డీవైఈఓతోపాటు డీఈఓ కిరణ్‌కుమార్‌కు నేరుగా వినిపించారు. భోజనం నాణ్యంగా లేదని, అది కూడా మెనూ ప్రకారం పెట్టడం లేదని పాఠశాల తనిఖీకి వెళ్లిన డీఈఓకు ఫిర్యాదు చేశారు. భోజనం సరిగా లేని విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజే కలెక్టర్‌కు ఎస్ఎంసీ చైర్మన్ సైతం వినతి పత్రం అందజేశారు. ఇవే పరిస్థితులు కనిగిరి నియోజకవర్గంలోని మరిన్ని పాఠశాలల్లో దాపురించాయి. ఎక్కడెక్కడి నుంచో చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులు ఫిర్యాదులు చేయలేక ఆకలి బాధను కడుపులోనే దాచుకుంటున్న దీనస్థితి.


డీఈఓ, డీవైఈఓకు భోజనం బాగోలేదని ఫిర్యాదు చేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

దొడ్డు బియ్యం.. తినలేకపోతున్నాం


మంత్రి సవితకు భోజనం బాగోలేదని ఫిర్యాదు చేస్తున్న బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు(ఫైల్)

సీన్ 4
ఎక్కడ: కనిగిరి
ఎప్పుడు: మార్చి 8

'రోజూ లావు బియ్యంతో అన్నం పెడుతున్నారు. అది తినలేకపోతున్నాం. మంచి నీళ్లకు చాలా ఇబ్బంది పడుతున్నాం. హాస్టల్ బిల్డింగ్ కూడా బాగోలేదు' అని కనిగిరి బీసీ గురుకులం విద్యార్థులు రాష్ట్ర మంత్రులు ఎస్. సవి, ఆనం రామనారయణరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 8వ తేదీన కనిగిరి వచ్చిన ఇద్దరు మంత్రులు.. ఇక్కడి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మెనూ, ఇతర వసతుల గురించి ఆరా తీస్తున్న సమయంలో విద్యార్థులు తమ అవస్థలను తెలియజేశారు. వచ్చే ఏడాది నుంచి వసతి గృహాలకు బీపీటీ బియ్యాన్ని అందజేస్తామని పాడిపాడిగా మాట్లాడి మంత్రి సవిత వెళ్లిపోగా.. ఇక్కడి పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు.

ఏడు రోజులుగా ఆకలి కేకలు

సీన్ 6
ఎక్కడ: గిద్దలూరు
ఎప్పుడు: ఏప్రిల్ 2

గిద్దలూరు మండలంలోని వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండిపెట్టడం మానేసి ఏడు రోజులైంది. పాఠశాలలోని 66 మంది విద్యార్థులు రోజూ ఇంటి నుంచి క్యారేజీ తెచ్చుకుని తింటున్నారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను తొలగించి తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించేందుకు వేసిన ఎత్తుగడ.. విద్యార్థులకు ఆకలి బాధలు తెచ్చిపెట్టింది. ఈ పాఠశాలలోని ముగ్గురు వంట మనుషుల్లో వెంకటలక్ష్మమ్మను ఉద్యోగం నుంచి తొలగించారు. మిగిలిన ఇద్దరు కుమారి, రంగలక్ష్మమ్మ ఆరోగ్యం బాగోలేదని పాఠశాలకు రావడం లేదు. దీంతో పేద విద్యార్థులకు ఆకలి బాధలు తప్పడం లేదు.


వెంకటాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 10.38 నిమిషాలకు వంట గది వద్ద ఆయాతో ముచ్చటిస్తున్న టీచరు

లోకేష్ పర్యటనలో ఏరులై పారిన మద్యం


మీటింగ్ జరుగుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపల్లి గ్రామంలో కంప్రెస్డ్ బయో గ్యాస్‌ప్లాంట్ భూమి పూజకు మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. అయితే లోకేష్ పర్యటన సందర్భంగా స్థానిక నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎవ్వరూ రారన్న ఉద్దేశంతో మద్యాన్ని ఏరులై పారించారు. ఇక మహిళలను కార్యక్రమానికి తరలించేందుకు నానా పాట్లు పడ్డారు. కార్యక్రమానికి వస్తే డ్వాక్రా మహిళలకు రాయితీ రుణాలిస్తామని మభ్యపెట్టారు. ఉపాధి కూలీలు పనికి వెళ్లకుండా కార్యక్రమానికి వస్తే మస్టర్ వేస్తామని నమ్మబలికారు. తీరా కార్యక్రమం ప్లాంట్ శంకుస్థాపన అని తెలియడంతో డ్వాక్రా మహిళలు మండిపడ్డారు. రాయితీ రుణాలంటే ఇక్కడకు వచ్చామని, లేదంటే ఈ కొండల్లో మాకేంటి పనంటూ రుసరుసలాడుతూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇక విచ్చలవడిగా మద్యం సరఫరా చేయడంతో మందుబాబులు తాగి సభా ప్రాంగణంలోనే పడిపోయారు. కార్యక్రమానికి ప్రజలను తరలించేందుకు స్కూల్, కాలేజీ బస్సులను వినియోగించారు. అయితే చాలా వాహనాలు ప్రజలు లేకుండానే వచ్చాయి.


పూటుగా మద్యం తాగి సభా ప్రాంగణంలోనే పడిపోయిన మందు బాబు

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి గాయాలు


మృతి చెందిన వెంకయ్య

పొన్నలూరు: ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ముత్తరాసుపాలెం, ముప్పాళ్ల రోడ్డు మార్గంలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలు మేరకు..ముత్తరాసుపాలెం గ్రామానికి చెందిన సర్వేపల్లి వెంకయ్య(50) సర్వేపల్లి వెంకట్రావు, లేత వడ్ల రామకృష్ణ ముప్పాళ్ల సమీపంలోని పాలేరులో ఇసుక లోడుకి ట్రాక్టర్‌లో బయలుదేరారు. రామకృష్ణ ట్రాక్టర్ నడుపుతుండగా మిగిలిన ఇద్దరు అతని పక్కనే ఇంజన్‌లో కూర్చున్నారు. ఈ క్రమంలో కొంత దూరం వెళ్లిన తరువాత మార్గమధ్యలో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ట్రాక్టర్ ఇంజన్‌లో కూర్చున్న వెంకయ్య భయపడి కిందకు దూకడంతో తారు రోడ్డుపై పడి తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే రామకృష్ణ, వెంకట్రావులు గుంతలో పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108కి సమాచరం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రులను చికిత్స కోసం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే వెంకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మద్యం మత్తులో ట్రాక్టర్‌ను నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ మేరకు ఎస్సై అనూక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమరజీవి అంటే అంత నిర్లక్ష్యమా లోకేష్?

ఒంగోలు టౌన్: పొట్టి శ్రీరాములు పుట్టిన ఊరు పడమటిపల్లికు పది కిలో మీటర్ల దూరంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అమరజీవి గురించి మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం అమరజీవి పట్ల ఆయన నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. యువగళం యాత్ర సందర్భంగా కూడా అలవపాడు వరకు పాదయాత్ర చేశారని, పొట్టి శ్రీరాములు కోసం మరో పది కిలో మీటర్లు పాదయాత్ర చేయకపోవడం బాధాకరమన్నారు. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేసి ఆ మహనీయుడి త్యాగాలను గౌరవించారని తెలిపారు. అలాగే 2014లో నాటి చంద్రబాబు ప్రభుత్వం మార్చిన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే నవంబర్ 1వ తేదీకి మార్చి పొట్టిశ్రీరాములు పట్ల గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు వారసులను సన్మానించే సమయంలో మారెళ్ల ఆసుపత్రిని బాగు చేయిస్తామని చెప్పారని, నేటికి నాలుగు నెలలు గడిచినా హాస్పిటల్ భవనానికి కనీసం సున్నం కూడా కొట్టలేదన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మార్కాపురం టౌన్: అతిగా మద్యం తాగి అనారోగ్యానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని వడ్డె బజారుకు చెందిన కుంచాల ఆంజనేయులు(35) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లోనే మద్యం తాగాడు. రాత్రి సమయంలో తీవ్రమైన కడుపునొప్పిరావడంతో కుటుంబసభ్యులు వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

ముండ్లమూరు(కురిచేడు): మండలంలోని చంద్రగిరి సమీపంలోని శ్రీరామ్ డెయిరీ వద్ద గేటు పక్కన రోడ్ మార్జిన్‌లో ఉన్న నీటి కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన మహేష్‌బాబు(37) ఆదివారం ఉగాది పండుగ రోజున ముండ్లమూరులోని తన సోదరుడు హనుమంతరావు ఇంటికి వచ్చాడు. భోజనం చేసి తిరిగి విఠలాపురం వెళుతూ చంద్రగిరి సమీపంలోని సైడ్‌కాలువలో పడి మృతిచెందాడు. నీరు ఎక్కువగా ఉండటంతో మృతదేహం కనిపించలేదు. నీరు తగ్గిన తరువాత మృతదేహం బయటపడటంతో ఆ రోడ్డున వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగరాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం వద్ద ఆనవాళ్లు పరిశీలించగా మృతుడు విఠలాపురం గ్రామానికి చెందిన మహేష్‌బాబుగా నిర్ధారించారు. మృతుని తల్లి ఘటనా స్థలానికి వచ్చి తన కుమారుడేనని నిర్ధారించి బోరున విలపించింది. పోస్టుమార్టం అనంతరంమృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

చంపేశారా..?

- వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య ?
- పాతపాడులో సంచలనం సృష్టించిన అర్జున్ రెడ్డి అదృశ్యం
- మృతదేహాన్ని గుర్తించలేదని చెబుతున్న తాలుకా సీఐ అజయ్ కుమార్
- తామే గుర్తించామని చెబుతున్న అర్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడితో కలిసి కట్టుకున్న భార్యే భర్తను హత్య చేయించినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించడం సంచలనం సృష్టిస్తోంది. మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం..ఒంగోలు రూరల్ మండలం పాతపాడు గ్రామానికి చెందిన మారుబోయిన అర్జున్ రెడ్డి (57) గత నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ విషయాన్ని ఆయన భార్య సుశీల పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో అనుమానం వచ్చిన అర్జున్‌రెడ్డి సోదరుడు మారుబోయిన వెంకటేశ్వరరెడ్డి గత నెల 29వ తేదీన తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో దశరాజుపల్లి వెళ్లే దారిలో పోతురాజు కాలువ దాటిన తరువాత నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని ఒక ఒరలో బుధవారం ఒక మృతదేహాన్ని గుర్తించారు. అది అర్జున్‌రెడ్డి మృతదేహమేనని కుటుంబసభ్యులు చెబుతుండగా..కాదు ఇంకా ఆయన మృతదేహాన్ని గుర్తించలేదని పోలీసులు చెబుతున్నారు. ఆ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఇది ఇలా ఉండగా అర్జున్‌రెడ్డి భార్య సుశీలకు అదే గ్రామానికి చెందిన కాపూరి రమేష్‌రెడ్డితో అక్రమ సంబంధం ఉందని తెలుస్తుంది. అర్జున్ రెడ్డిని అడ్డు తొలగించుకునేందుకు వీరిద్దరూ కలిసి హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అర్జున్ రెడ్డి అదృశ్యమైన రోజు నుంచి సుశీల, రమేష్ రెడ్డి కనిపించకుండా పరారవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తుంది. ప్రస్తుతం వీరిద్దరిని తాలుకా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అర్జున్‌రెడ్డిని హత్య చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లిన తాలుకా పోలీసులు అర్జున్ రెడ్డి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలుస్తుంది.


కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైన మృతదేహం

నాడు ప్రియుడి భార్య....నేడు ప్రియురాలి భర్త ...

ఇదిలా ఉండగా కాపూరి రమేష్‌రెడ్డికి అర్జున్‌రెడ్డి భార్య సుశీలకు చాలా కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో రమేష్ రెడ్డి తన భార్య కుమారిని హత్య చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. భార్య హత్య కేసులో రమేష్ రెడ్డి జైలుకు వెళ్లి వచ్చాడు. తాజాగా ఇప్పుడు సుశీల భర్త అర్జున్ రెడ్డిని కూడా హత్య చేయడం సంచలనం రేకెత్తిస్తుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో అటు ప్రియుడి భార్య, ఇటు ప్రియురాలి భర్త హత్యకు గురవడం గమనార్హం. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.